సాక్షి
తిరుపతి

సోమవారం । 18 । మార్చి । 2024



ప్రతిష్టాత్మకం.. గెలుపే లక్ష్యం

గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. - 8లో



భావి తరాల కోసమే 'ఆర్ట్ ఫౌండేషన్'

మన సంస్కృతిని భావి తరాలకు అందించేందుకే ఆర్ట్ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని మంచు విష్ణు తెలిపారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
తిరుపతి	6-26	4-59
గూడూరు	6-24	4-53

న్యూస్‌రీల్

కట్టుదిట్టంగా 'కోడ్'

తిరుపతి అర్బన్ : జిల్లాలో కట్టుదిట్టంగా ఎన్నికల కోడ్ అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ లక్ష్మీ శ విజయవాడలో సీఈఓ కార్యాలయంలో హాజరయ్యారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. సీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనల హోర్డింగ్‌లు, పోస్టర్లు , కటౌట్లను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తుల స్థలాల్లోనూ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన బోర్డులను తీయించాలని సూచించారు. సి-విజిల్‌లో అందే ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

'స్పందన' రద్దు



పెంచల కిషోర్, డీఆర్‌ఓ

తిరుపతి అర్బన్ : ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కోడ్ నిబంధనల మేరకు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు డీఆర్‌ఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే ఫిర్యాదులను కలెక్టరేట్‌లో స్వీకరిస్తామన్నారు. అలాగే జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను పరిష్కరిస్తారని వెల్లడించారు.

5న తిరుమలలో అన్నమయ్య వర్ధంతి

తిరుమల : పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతిని ఏప్రిల్ 5వ తేదీన తిరుమలలో టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఊరేగింపుగా బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకోనున్నారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించనున్నారు. తర్వాత స్వామివారు ఉభయదేవేరులతో ఆలయానికి వేంచేపు చేయనున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు ఏటీసీ వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 74,351 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,164 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.04 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

నేటి నుంచి విజ్ఞాన వ్యవస్థపై శిక్షణ

తిరుపతి సిటీ : కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, యూజీసీ ఆధ్వర్యంలో తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదికగా భారతీయ విజ్ఞాన వ్యవస్థపై అధ్యాపకులకు సోమవారం నుంచి ఆరు రోజులపాటు శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. దక్షిణ భారతదేశంతో పాటు గుజరాత్, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాల నుంచి సుమారు 125 మంది అధ్యాపకులు శిక్షణకు హాజరుకానున్నారు. ఈ సదసులో నూతన విద్యావిధానంలో భాగంగా ఆయుర్వేదం, ఆర్కిటెక్చర్, గణితం, వ్యవసాయం, లోహశాస్త్రం తదితర అంశాలపై నిపుణులతో శిక్షణ అందించనున్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న మనీష్ ఆర్ జోషి

తిరుపతి సిటీ: దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే యువత పాత్ర కీలకమని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సెక్రెటరీ ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి తెలిపారు. ఆదివారం తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీలో వికసిత్ భారత్-2047 అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 2047 సంవత్సరానికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు పొందుతుందన్నారు. ఇందుకోసం యువత నడుం బిగించాలని కోరారు. అనంతరం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ యువత ద్వారానే భారత్ వికసిస్తుందనే నమ్మకం ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సమాజ, దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో యూజీసీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ శాలిని, రిజిస్ట్రార్ రామశ్రీ,, ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, ప్రొఫెసర్ చంద్రశేఖరం పాల్గొన్నారు.

పెద్ద మనసు!





ఒకప్పుడు కుటుంబాలను ఒంటి చేత్తో నడిపించారు. పిల్లలను పెద్దచేసి పెళ్లిళ్లు చేశారు. ఆ తర్వాత వయసు మీదపడడంతో బిడ్డలపై ఆధారపడలేక.. పనిచేసుకుని బతకలేక నలిగిపోయేవారు. గత టీడీపీ హయాంలో వచ్చే అరకొర పింఛన్‌తో బతుకుబండిని సాఫీగా సాగించలేక కుమిలిపోయేవారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వారి స్థితిగతులే మారిపోయాయి. ఈ ఏడాది జనవరి నుంచి ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్ ఠంచన్‌గా అందుతుండడంతో తమ బాగోగులతోపాటు కుటుంబాలకు చేయూతనివ్వడం వారిలో మరింత ఆత్మగౌరవాన్ని పెంచుతోంది. ముఖ్యంగా మనవళ్లు, మనవరాళ్ల చదువులకు పెద్ద పీట వేస్తూ పెద్దమనసు చాటుకుంటున్నారని సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

- పండుటాకుల జీవితాల్లో వెలుగులు
- కుటుంబాలకు చేదోడుగా అవ్వాతాతలు
- మనవళ్లు.. మనవరాళ్లకు అండగా నిలుస్తున్న వృద్ధులు
- ఆత్మగౌరవం కాపాడుతున్నారంటూ జగనన్నకు కృతజ్ఞతలు

ఈ మహిళ పేరు దామరపాకం సుభాషిణి, వెంకటగిరి మున్సిపాలిటీ, బంగారుపేట. వివాహమైన ఇద్దరు కుమార్తెలు జన్మించిన తర్వాత ఆమె భర్త మృత్యువాత పడ్డాడు. ఇద్దరు చిన్నారులతో బతుకు భారమైన తరుణంలో ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలు ఎంతగానో ఆదుకుంటున్నాయి. ఆమెకు ప్రతి నెలా రూ.3వేల చొప్పున వితంతు పింఛన్ అందుతోంది. అలాగే పిల్లల చదువుకు అమ్మఒడి, డ్వాక్రా రుణ మాఫీ చేయడం వంటి పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ఒంటరిగా కష్టతరంగా ఉన్న ఆమె జీవనం ప్రస్తుతం సాఫీగా సాగిపోతోంది. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలు చక్కగా చదువుకుంటున్నారని సంతోషంగా చెబుతోంది.

సైదాపురం : అవ్వాతాతలకు నేనున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపన్న హస్తం అందించారు. వేకువ జామునే నిద్రలేపి మరీ ఇంటి ముంగిటే పింఛన్ అందించి నిస్సహాయుల్లో ఆనందం నింపుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అధినేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పింఛన్ల మొత్తాన్ని పెంచుతామని మాటిచ్చారు...ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం పింఛన్ల పెంపుపై చేసి మన్ననలు అందుకున్నారు. ఆ తర్వాత ఏటా పింఛన్ల మొత్తాన్ని విడతల వారీగా పెంచుతూ ఈ ఏడాది జనవరి నుంచి అవ్వాతాతలకు రూ.3వేలు అందిస్తున్నారు.

నేడు ఇంటి ముంగిటకే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎవరి సిఫార్సులు అక్కర్లేదు.. అర్హత ఉంటే చాలు పింఛన్ మంజూరు చేస్తున్నారు. అర్జీ పెట్టుకున్న 21రోజుల్లోనే పెన్షన్ కార్డులు అందజేస్తున్నారు. కొందరు అవ్వాతాతలు తమకు నెలనెలా వచ్చే పింఛన్ సొమ్ములను దాచిపెట్టి మరీ వారి మనవళ్లు, మనవరాళ్ల చదువులకు అందిస్తున్నారంటే ఇప్పటి పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ హయాంలో ఒకరు చనిపోతేనే!

టీడీపీ హయాంలో పింఛన్ మంజూరు కావాలన్నా.. పింఛన్ నగదు తీసుకోవాలన్నా లబ్ధిదారులకు నరకం కనిపించేది. నిర్దేశిత ప్రదేశాల్లో బారులు తీరి, నిరీక్షణలతో అవస్థలు పడాల్సి వచ్చేది. ఉదయం పనులు మానుకుని పంచాయతీ కార్యాలయాల ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. వీటన్నిటినీ మించి జన్మభూమి కమిటీల ఆమోదం పొందాలంటే తలప్రాణం తోకకు వచ్చేది. ఇక కొత్తగా పింఛన్ మంజూరు కావాలంటే మరీ దారుణం. ఒక పింఛన్‌దారుడు మరణిస్తేనే వారి స్థానంలో మరొకరికి పింఛన్ మంజూరయ్యేది. అప్పటి వరకు అర్హత ఉన్నా పింఛన్ అందేది కాదు.

ఈ వృద్ధురాలి పేరు కుంబా వెంకటమ్మ. వెంకటగిరి పురపాలక పరిధిలోని బంగారుపేట. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌తో కుటుంబానికి ఎన్నో రకాలుగా ఉపయోగపడుతోంది. ప్రతి నెలా వేకువనే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే వచ్చి అందించే రూ.3వేలు పింఛన్‌ను తీసుకుంటోంది. ఈ నగదుతో తనకు కావాల్సిన మందులు, వ్యక్తిగత ఖర్చులకు వినియోగించుకుంటోంది. ఆ పింఛన్ మొత్తంలోనే నెలవారీ కొంత నగదును మిగుల్చుకుంటోంది. ఆ సొమ్మును తమ మనవళ్లు, మనవరాళ్లు ట్యూషన్ ఫీజులకు చెల్లిస్తోంది. గతంలో పింఛన్ సొమ్ములో చిల్లిగవ్వ కూడా మిగిలేది కాదు. జగనన్న రూ.3వేలు ఇస్తుండడంతో ప్రతి నెలా రూ.500 నుంచి 750 పొదుపు చేసుకుంటోంది. ఆడబ్బుతో తన కుటుంబానికి చేదోడుగా నిలుస్తోంది. ముఖ్యంగా పిల్లల చదువుకు ఉపయోగపడడంపై ఆనందం వ్యక్తం చేస్తోంది.



- ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు చెన్నూరు పెంచలమ్మ. వెంకటగిరి పట్టణం బంగారుపేట. ఆమె కుమారుడు శ్రీనివాసులు అనారోగ్యంతో ఏడాది క్రితం మరణించాడు. ఇక అప్పటి నుంచి మనవడు నందకిషోర్‌కు అన్నీ తానై చూసుకుంటోంది. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ సొమ్ముతో బిడ్డను కడుపులో పెట్టుకుని పోషించుకుంటోంది. ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నగదుతో మనవడిని చదివించుకుంటోంది. జగన్‌బాబు సాయం లేకుంటే తాము ఏమైపోయేవాళ్లమో అని కృతజ్ఞతలు తెలియజేస్తోంది.



- ఈ ఫొటో ఉన్న మహిళ పేరు ఇల్లుపూరి తిరుపాలమ్మ. వెంకటగిరి మున్సిపాలిటీ బంగారుపేట. ముగ్గురు కుమార్తెలు. అందరికీ వివాహం చేసింది. వయసు పైబడుతున్న తరుణంలో తోడుగా ఉండాల్సిన భర్త సుబ్రమణ్యం నాలుగేళ్ల క్రితం మరణించాడు. దీంతో ఒంటరిగా మిగిలిపోయింది. పొట్టకూటికి కష్టంగా ఉన్న తరుణంలో ప్రభుత్వం అందించిన వితంతువు పింఛన్ ఆదుకుంది. అలాగే వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలు అండగా నిలిచాయి. దీంతో మనోధైర్యం వచ్చింది. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటోంది. కుమార్తెల బిడ్డలకు అవసరమైన యూనిఫామ్‌లను సైతం ఆమే కొనిస్తోంది. ఈ వయసులో కూడా మనవళ్లకు సాయం చేసే అవకాశం కల్పించిన జగనన్న రుణం తీర్చుకోలేమంటూ కొనియాడుతోంది.

ప్రతి నెలా రూ.వెయ్యి కూడబెడుతున్నా



మాది నిరుపేద కుటుంబం. రోజూ కూలీ పనులకు పోయి జీవనం సాగించే వాళ్లం. నా భర్త వెంకటరమణయ్య ఐదేళ్ల క్రితం చనిపోయాడు. ఉన్న ఇద్దరు బిడ్డలకు పెళ్లి చేసి పంపించా. తర్వాత బతుకు కష్టంగా మారింది. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని నాకు నెలానెలా రూ.3వేల పింఛన్ వస్తోంది. తలుపు తట్టి మా వలంటీరు డబ్బులు ఇస్తోంది. ఆ సొమ్ముతోనే జీవనం సాగిస్తున్నా. ప్రతి నెలా రేషన్ బియ్యం వస్తున్నాయి. పింఛన్ కింద వచ్చే రూ.3వేలలో రూ.2వేలు నా అవసరాలకు వాడుకుని, మరో రూ.వెయ్యి పొదుపు చేసుకుంటున్నా. ఆ డబ్బును నా కుమార్తెల బిడ్డల ట్యూషన్ ఫీజులు, వారికి కావాల్సిన ఇతర విద్యాసామగ్రి కొనేందుకు వినియోగిస్తున్నా. మా బిడ్డలు సంతోషంగా బడికి పోతున్నారు. అది చాలు నాకు. – మొలకల బుజ్జమ్మ, సైదాపురం

నా కొడుకు బిడ్డల ఆలనాపాలనా నాదే



రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మాది. నా భర్త 10 ఏళ్ల క్రితం మరణించారు. కొడుకు, కూతురు ఉన్నారు. ఎంతో కష్టపడి వారికి పెళ్లి చేశా. ప్రస్తుతం కొడుకు వద్దనే ఉంటున్నా. గతంలో మందులు కొనుక్కునేందుకు కూడా ఇబ్బంది పడేదాన్ని. ప్రతి దానికీ చేయి చాపాలంటే ఇబ్బందిగా ఉండేది. పింఛన్ సొమ్ము సక్రమంగా వచ్చేది కాదు. ఇప్పుడు సకాలంలో పింఛన్ నగదు వస్తుండడంతో ప్రశాంతంగా ఉంది. నా ఖర్చులకు పోను కొంత మొత్తం పొదుపు చేసుకుంటున్నా. ఆ డబ్బుతో నా కొడుకు బిడ్డల ఆలనా పాలనా చూసుకుంటున్నా. పిల్లలను చక్కగా చదివిస్తున్నా. మాలాంటి వారికి ఇంతగా సాయం చేస్తున్న జగనన్నే మళ్లీ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. – జడపల్లి శంకరమ్మ, ఊటుకూరు

మనవళ్లను నేనే చదివిస్తున్నా



ఊటుకూరు బస్టాండ్‌లో టిఫిన్ అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. భర్త చనిపోవడంతో కుమారులతో కలిసి దుకాణం నడుపుకుంటున్నా. కుమార్తెకు పెళ్లి చేశా. ఉన్న ముగ్గురు కుమారులకు కూడా వివాహం అయ్యింది. నా బిడ్డలకు మొత్తం 12 మంది పిల్లలు. వారి చదువుల ఖర్చులను నేనే భరిస్తున్నా. ప్రతి నెలా నాకు వచ్చే పింఛన్ డబ్బులను అలాగే దాచి పెట్టి మనవళ్లు..మనవరాళ్లకు యూనిఫామ్ కొనిస్తున్నా. వాటితో పాటు బ్యాగులు, షూ కూడా తీసిస్తున్నా. పిల్లలు సైతం ఏ అవసరం వచ్చినా నా దగ్గరకే వస్తారు. అన్ని విషయాల్లో నాకే ప్రాధాన్యమిస్తుంటారు. నా ఆత్మగౌరవం పెంచిన జగనన్నను జీవితాంతం గుర్తుపెట్టుకుంటా. – షేక్ నూర్జహాన్, ఊటుకూరు

నా మనవడిని బీటెక్ చదివిస్తున్నా



నా భర్త చనిపోయి 15 ఏళ్లు కావస్తోంది. గతంలో దగ్గర్లోని గనిలో పనులకు వెళ్లి జీవనం సాగించేదాన్ని. కుమార్తె, కుమారుడికి పెళ్లి చేశా. నా మనవడిని నేనే చదివించుకుంటున్నా. నాకు వచ్చే రూ.3వేలు పింఛన్ డబ్బులోనే కొంత మిగుల్చుకుని బిడ్డ అవసరాలకు వాడుకుంటున్నా. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో నా మనవడు బీటెక్ చదువుకుంటున్నాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతోనే ఇది సాధ్యమైంది. ఆయన మేలును జీవితంలో మరువలేం. – ఎం.పెంచలమ్మ, ఊటుకూరు

మళ్లీ జగనే ముఖ్యమంత్రి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- సంక్షేమం కొనసాగాలంటే మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించండి
- పూతలపట్టు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- మంత్రి పెద్దిరెడ్డి పర్యటనతో పూతలపట్టు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, చిత్తూరు ఎంపీ, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, సునీల్‌కుమార్



వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీలో మంత్రి పెద్దిరెడ్డి తదితరులు

సాక్షి, చిత్తూరు: సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పూతలపట్టు నియోజవర్గంలోని ఐరాల, యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లె మండలాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి ఎన్.రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్‌తో కలసి ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ప్రసంగించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారని స్పష్టం చేశారు. కరోనా కష్టకాలంలో రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు పేదలకు నేనున్నా.. అన్న భరోసా కల్పించి వారి ప్రాణాలు కాపాడారని గుర్తు చేశారు. జగన్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో యువతకు 4.5 లక్షల ఉద్యోగాలను కల్పించారన్నారు. మహిళలకు ఆర్థిక చేయూతను కల్పించి అండగా నిలిచారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్‌మోహన్ రెడ్డి చెప్పిందే చేస్తారని, చేయగలిగిందే చెప్తారని స్పష్టం చేశారు. త్వరలో మళ్లీ సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేయాలంటే ప్రజలంతా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా డాక్టర్ సునీల్‌కుమార్, ఎంపీగా రెడ్డెప్పను అత్యధిక మెజారిటీతో గెలించాలన్నారు.

బాబును నమ్మకండి..

ప్రజలను మోసగించి అధికారం చేజిక్కించుకునేందుకు చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో వస్తున్నాడని, బాబు మాటలు నమ్మి మోసపోవద్దని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. గత ఎన్నికలకు ముందు ప్రజలకు 600 హామీ ఇచ్చిన బాబు ఒక్కటి కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన చంద్రబాబు సొంత జిల్లాకు ఏమీ చేయలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌తోనే సాధ్యమన్నారు.

నయా జోష్..


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూతలపట్టు నియోజవర్గంలో పర్యటించడంతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తలను గుర్తిస్తామని మంత్రి పెద్దిరెడ్డి హామీ ఇచ్చారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఎన్.రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీ గెలిపించుకుంటామని మంత్రికి ఎక్కడికక్కడ నేతలు, కార్యకర్తలు కూడా స్పష్టం చేశారు.

యాదమరిలో..

యాదమరి: రానున్న ఎన్నికల్లో రాజన్న రాజ్యం మళ్లీ అధికారంలోకి వస్తుంది.. మరో ఐదేళ్లలో రాష్ట్రంలో ఇప్పుడు అందిస్తున్న పథకాలు అన్ని అలాగే అమలు చేస్తామని విద్యుత్, అటవీశాఖ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, బీఎంఆర్ సంస్థల అధినేత మోహన్ రెడ్డి, పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ యాదమరి మండలం చెన్నారెడ్డి పల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే పెరుమాళ్లపల్లె వద్ద మనోహర్ రెడ్డి అధ్యక్షతన మంత్రి పెద్దిరెడ్డిని, ఇతర నాయకులకు పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. 45 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చక ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఎన్ని పార్టీలు ఉంటే వారికి ప్యాకేజీలు ఇచ్చి, వారి కాళ్లు పట్టుకుని లోలోపల నానా తంటాలు పడుతుంటారని ఆరోపించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా చేసేందేమీ లేదన్నారు. ప్రజలు అంతా జగనన్న ఐదేళ్ల సంక్షేమ పాలనను చూసి ఓటు వేయాలని తెలియజేశారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 162 కేంద్రాలు
- హాజరుకానున్న 30,846 మంది విద్యార్థులు



తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 162 కేంద్రాల్లో ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు చేపట్టనున్నారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు మొత్తం 30,846మంది పరీక్షలకు హాజరుకానున్నారు.162 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 162 మంది డీఓలు, 1,666 మంది ఇన్విజిలేటర్లు, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించారు. గుర్తించి మూడు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు విధులు నిర్వర్తించే సిబ్బంది సైతం సెల్ ఫోన్ తీసుకెళ్లకూడదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

మధ్యాహ్నం నుంచి ఓపెన్ స్కూల్

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలను 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు చేపట్టనున్నారు. పదో తరగతికి 7, ఇంటర్‌కి 13, మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 1,611మంది, ఇంటర్‌కు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 3,235మంది, మొత్తం 4,846మంది హాజరవుతున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సూళ్లూరుపేట టీడీపీలో విభేదాలు

- వేనాటి సతీష్‌రెడ్డిని దూరం పెడుతున్న కొండేపాటి వర్గీయులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీలో విబేధాల భగ్గుమంటున్నాయి. నెలవల సుబ్రమణ్యం కుమార్తె విజయశ్రీకి టీడీపీ టికెట్ ప్రకటించినప్పటి నుంచి మంట రాజుకుంది. కొండేపాటి గంగాప్రసాద్, బీజేపీ నేత వాకాటి నారాయణరెడ్డి పథకం ప్రకారం వేనాటి వర్గీయులను టీడీపీకి దూరం చేస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. శుక్రవారం సాయంత్రం తడ మండలం చేనిగుంటలోని వాకాటి నివాసంలో కొండేపాటి గంగాప్రసాద్, నెలవల సుబ్రమణ్యం, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, బొమ్మన పళణి, బొమ్మన శ్రీధర్, ఏకాంబరం, మాధవనాయుడు తదితరులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వేనాటి వర్గీయులకు ఎలాంటి పిలుపు రాలేదు. ఇటీవల ఓజిలి మండలం కురుగొండలో ప్రచారం నిర్వహించినప్పుడు వేనాటి వర్గానికి సమాచారం ఇవ్వలేదు. శనివారం దొరవారిసత్రం మండలం తనయేలి, బూదూరు, తుంగమడుగు గ్రామాల్లో విజయశ్రీ నిర్వహించిన ప్రచారానికి సైతం వేనాటి సతీష్‌రెడ్డికి సమాచాం లేదు. ఆదివారం సూళ్లూరుపేటలో అభ్యర్థి పరిచయ వేదిక నిర్వహించారు. ఇక్కడ కూడా వేనాటి వర్గీయులు లేకుండా చూసుకున్నారు. వేనాటి సతీష్‌రెడ్డి ప్రాధాన్యతను తగ్గించేందుకు కొండేపాటి గంగాప్రసాద్ వర్గీయులు చాప కింద నీరులా పని చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అధిష్టానం వ్యవహరిస్తున్న తీరుతో ఆ పార్టీ సీనియర్ నేత వేనాటి రామచంద్రారెడ్డి గుడ్‌బై చెప్పేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ తండ్రి నెలవల సుబ్రమణ్యం, చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన కొండేపాటి గంగాప్రసాద్, బీజేపీ మిత్రపక్షం నేత వాకాటి నారాయణరెడ్డి పథకం ప్రకారమే వేనాటి సతీష్‌రెడ్డికి పొగబెడుతున్నట్లు సమాచారం. వీరి తీరుపై వేనాటి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీఓ చెక్‌పోస్టుకు మంగళం

తడ: మండలంలోని జిల్లా సరిహద్దుల్లో ఉన్న బీవీపాళెం రవాణా శాఖ కార్యాలయం వద్ద తనిఖీలను నిలుపుదల చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కార్యాలయంలో లాగిన్‌లు నిలిపి వేయడంతో వాహనాల పర్మిట్లు, తనిఖీలు నిలిచిపోయాయి. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎన్నికల నేపథ్యంలో చేపట్టే తనిఖీలను మాత్రమే నిర్వహిస్తున్నారు. దీనిపై సోమవారం పూర్తి వివరాలతో స్పష్టత వస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రతిష్టాత్మకం.. గెలుపే లక్ష్యం



సభలో మాట్లాడుతున్న వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

రాపూరు : సార్వత్రిక ఎన్నికలను వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గెలుపే లక్ష్యంగా పోరాడాలని వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాపూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్‌తో కలిసి పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో మొత్తం 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నానని, అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నానని, ఎన్నికల అనంతరం అన్నీ ఆచరణలోకి తీసుకువస్తానని వివరించారు. పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని విన్నవించారు. మురళీధర్ మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి రావడం ఒక వరమని తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వెంకటగిరి విశేషంగా అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. రామ్‌కుమార్‌రెడ్డి నిజాయితీగా పనిచేస్తారని అబద్ధాలు చెప్పరని, గూడూరు నియోజకవర్గంలో తనకు ఎంతో సహకారం అందిస్తున్నారని వెల్లడించారు. రామన్నకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం వేపినాపి సమీపంలోని పోతుకొండ అంకాలమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.

పలువురు యువత చేరిక

వైఎస్సార్‌సీపీ నేత బొడ్డు అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో జనసేన, టీడీపీకి చెందిన 200 మంది యువకులు పార్టీలో చేరారు. రామ్‌కుమార్‌రెడ్డి, మురళీధర్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, వైస్ఎంపీపీ పెంచలరెడ్డి, నాయకులు కలిమిలి సురేష్‌రెడ్డి, మేడా సునీల్‌కుమార్‌రెడ్డి, కలువాయి జెట్పీటీసీ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, చిట్టేటి హరికృష్ణ, కృష్ణారెడ్డి, నెల్లూరురవీంద్రారెడ్డి, పిచ్చిరెడ్డి, మధురెడ్డి, బుజ్జిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రమణారెడ్డి, రాఘవయ్య, కోటేశ్వరరెడ్డి, గౌరమ్మ, పెంచలస్వామి, ఉమామహేశ్వరరెడ్డి, రాఘవరెడ్డి, రమణయ్య, లోకేష్, మనోజ్, డాక్టర్ ఖాదర్ బాషా, గౌస్‌పీర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్షలు

తిరుపతి అర్బన్ : జిల్లాలో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్‌-1 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఆర్‌ఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం పేపర్‌-1కు 64.38శాతం మంది, మధ్యాహ్నం పేపర్‌-2కు 63.84శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులు ఇబ్బంది పడకుండా పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించినట్లు వెల్లడించారు.

'నామిని'కి మాండలిక బ్రహ్మ అవార్డు



అవార్డు ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తదితరులు

రేణిగుంట : పాత్రికేయుడు, కథా రచయిత నామిని సుబ్రమణ్యంనాయుడుకు అమరరాజా తరఫున రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మాండలిక బ్రహ్మ' అవార్డు ప్రదానం చేశారు. ఆదివారం మండలంలోని కరకంబాడి అమరరాజ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్వేత డైరెక్టర్ భూమన్ అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజ వ్యవస్థాపక అధ్యక్షుడు గల్లా రామచంద్ర నాయుడు, ప్రజాగాయకుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సినీ గాయకుడు పెంచలదాసు, అమర ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని అతిథులుగా పాల్గొన్నారు. భూమన్ మాట్లాడుతూ ఈ రోజు అక్షరానికి, మాండలికానికి పట్టాభిషేకం జరుగుతోందన్నారు. మన పల్లె సంస్కృతిని, మన మాండలికాన్ని ప్రపంచానికి తెలియజేసిన నామిని సుబ్రమణ్యంనాయుడును సత్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు. నామిని సుబ్రమణ్యంనాయుడు తన రచనల్లో వాడిన మాండలిక పదాలు, పాత్రలపై ప్రజలు ఎంతో మమకారం పెంచుకున్నారని వెల్లడించారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ నామిని ఆదర్శప్రాయుడని, ఆయన సరసన వేదికను పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం సుబ్రమణ్యంనాయుడుకు అవార్డు ప్రదానం చేసి స్వర్ణ కంకణం తొడిగి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శాకం నాగరాజు, బొంతు రామచంద్రారెడ్డి, సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డి, జీకేఎస్ రాజా, అరసం ప్రతినిధులు యువశ్రీ మురళి, నేమిలేటి కిట్టన్న, కావా ప్రసాద్, వేమూరి జయరామ్‌ప్రసాద్, పురంధర్‌నాయుడు, రమేష్, పేరూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌తో టోకరా వేసిన కి'లేడి'



మాధవీలతారెడ్డి

పాకాల : ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళ సాయంత్రం ఇచ్చేస్తానంటూ డబ్బు తీసుకుని తన ప్రొఫైల్‌ను బ్లాక్ చేసిందని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల కథనం మేరకు.. పాకాల మండలానికి చెందిన వ్యక్తికి ఫేస్ బుక్‌లో మాధవీలతారెడ్డి అనే యువతి పరిచయమైంది. కొంచెం అమౌంట్ ఇస్తే తిరిగి సాయంత్రం ఇస్తానని చెప్పింది. కుంపటి మాధవీ లతారెడ్డి పేరుతో ఫెడరల్ బ్యాంక్‌లో ఉన్న తన ఖాతా నంబర్ మెసేజ్ పెట్టింది. నగదు బదిలీ చేసిన తర్వాత స్క్రీన్‌షాట్ తీసి తన వాట్సాప్ నంబర్‌కు పెట్టాలని కోరింది. అతను అకౌంట్ నంబర్‌కు నగదు బదిలీ చేసేందుకు ప్రయత్నించి వీలుకాకపోవడంతో ఆమెకు చెప్పాడు. అనంతరం ఆమె పంపిన స్కానర్‌కి ఆమె అడిగిన నగదు పంపాడు. సుమారు 6 నుంచి 7 గంటలు అవుతున్నా ఆమె తిరిగి నగదు పంపించలేదు. దీంతో అతను ఆమెకు మెసేజ్ చేశాడు. ఆమె వెంటనే ఫేస్‌బుక్‌లో అతని ప్రొఫైల్‌ను బ్లాక్ చేసింది. మాధవీలతారెడ్డి తనను మోసం చేసిందని గ్రహించిన అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె ఫేస్‌బుక్‌లో హై ప్రొఫైల్ ఏర్పాటుచేసి ఇలా మోసం చేస్తోందని, చర్యలు తీసుకోవాలని కోరాడు.

కూలీలకు కండువా వేసి ఆర్భాటం!



ఒకరిద్దరు తప్ప అంతా స్థానికులే..

తడ : మండలంలోని కొండూరుకు చెందిన ఓ ఊరూపేరూ లేని సుధాకర్ అనే చోటా నాయకుడు లేనిపోని ఆర్భాటం చేసి టీడీపీ నాయకులను వెర్రి వెంగళప్పలను చేసిన విషయం గ్రామంలో చర్చనీయాంశమైంది. పెద్దసంఖ్యలో జనం టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారంటూ మండలస్థాయి నేతలకు సదరు చోటా నాయకుడు సమాచారం అందించాడు. అసలే ఎన్నికల సీజన్, ఎవరు చెప్పినా వినాల్సిన సమయం.. దీంతో టీడీపీ నియోజకవర్గ నేతలు పాలో మంటూ కొండూరు గ్రామంలో వాలిపోయారు. కాతీరా అక్కడికి వెళ్లాక గాని వారికి పరిస్థితి అర్థం కాలేదు. అక్కడకు వెళ్లిన నాయకులు ఎక్కువ, పార్టీలో చేరేందుకు వచ్చిన వాళ్లు తక్కువ అని గ్రహించి సదరు చోటా నాయకుడి మాట పట్టుకు వచ్చిన వారిపై మండిపడ్డారు. దీంతో మండల నాయకులు ఆగమేఘాల మీద గ్రామంలో పర్యటించి ఆదివారం కావడంతో గ్రామంలో చెట్టుకింద, గట్టుమీద కూర్చున్న పది, పదిహేను మంది కూలీలను తీసుకువచ్చారు. నెలవల సుబ్రమణ్యం సమక్షంలో తిరుమూరు సుధాకర్‌రెడ్డి చేతులమీదుగా పసుపు కండువాలు వేయించి చేతులు దులుపుకున్నారు. వీళ్ల కోసమా మమ్మల్ని ఇంతదూరం పిలిచి ఇబ్బంది పెట్టావు అనుకుంటూ నాయకులు ఉసూరు మంటూ వెళ్లిపోయారు. ఇంతోటి దానికి ఇన్ని కార్లు వేసుకుని హడావుడి చేశారా అని గ్రామస్తులు సైతం నవ్వుకోవడం విశేషం. ఎన్నికలు ముగిసే లోపు ఇలాంటి చిత్రాలు ఎన్ని చూడాలో అని చర్చించుకోవడం గమనార్హం.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు



పార్టీలో చేరిన వారితో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



టీడీపీ నేతలకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

తిరుపతి రూరల్ : రామచంద్రాపురం మండలం నెన్నూరు పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు ఆదివారం తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన వారికి కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. అనంతరం మోహిత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు రాజేంద్ర, దినేష్, మురళి పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్ : పట్టణంలోని కోళ్లమిట్ట ప్రాంతానికి చెందిన టీడీపీకి చెందిన 200 మంది నాయకులు, కార్యాకర్తలు వైఎస్సార్‌సీపీ పార్టీలోకి చేరారు. ఆదివారం ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. శివారెడ్డి, వాయులూరు సాయిరెడ్డి, లోకేష్‌యాదవ్, పి. జయరామయ్య, పి.పెరింరెడ్డి బాలారెడ్డి, పి. నరేష్, పి. మణి తదితరులకు ఎమ్మెల్యే సంజీవయ్య కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిన్న సత్యనారాయణ, విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు జెట్టి వేణు, అలవల సురేష్, బాబురెడ్డి, తుపాకుల ప్రసాద్, స్వామిరెడ్డి కృపాకర్‌రెడ్డి ,హుస్సేన్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తం.. చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ఉదయం సేవా మండపంలో అర్చకులు స్వామివారి చక్రానికి పూజలు జరిపించారు. అనంతరం భక్తసందోహం నడుమ స్నానఘట్టం పూర్తి చేశారు. రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలను పరిపూర్ణం చేశారు.

భావి తరాల కోసమే 'ఆర్ట్ ఫౌండేషన్'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంచు మోహన్‌బాబు, విష్ణు

చంద్రగిరి: మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకే మంచు విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల సీఈఓ, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంచు విష్ణు తెలిపారు. మన ప్రాంతంతో పాటు దేశ, విదేశాల్లోని ఆర్టిస్టులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2013లో మంచు విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ ప్రారంభించినట్లు వెల్లడించారు. ఆదివారం శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల్లో మంచు విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యాసంస్థల అధినేత మంచు మోహన్‌బాబు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్టిస్టులు వారి కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మంచు విష్ణు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ కలంకారీ ఆర్టిస్టు రమేష్ గురజాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎంబీయూ చాన్సలర్ మోహన్‌బాబు మాట్లాడుతూ యూనివర్సిటీ నెలకొల్పడం వెనుక 31 ఏళ్ల కష్టం దాగి ఉందని తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరుగా విద్యాసంస్థను ఏర్పాటు చేసి విశ్వవిద్యాలయం స్థాయికి తీసుకువచ్చామని వెల్లడించారు. ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన రెండు యూనివర్సిటీలతో ఎంబీయూ ఒప్పందం కుదుర్చుకుందని వివరించారు. ఎంబీయూలో ఆర్ట్ అండ్ పెయింటింగ్ కోర్సును కూడా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

ఆకట్టుకున్న పెయింటింగ్స్

దేశ, విదేశాల నుంచి వచ్చిన ఆర్టిస్టులు వారి కళానైపుణ్యంతో చూపరులను కట్టిపడేశారు. మనసుకు హత్తుకునే చిత్రాలను గీసి ప్రదర్శించారు. అనంతరం ఆర్టిస్టులను మోహన్‌బాబు, మంచు విష్ణు ఘనంగా సత్కరించారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



రేణిగుంట గిడ్డంగిలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

- కచ్చితంగా కోడ్ నిబంధనల అమలు
- కట్టుదిట్టంగా చర్యలు చేపట్టిన అధికారులు

జిల్లా సమాచారం

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
గూడూరు	1,16,982	1,2,3371	35	2,40,388	294
సూళ్లూరుపేట	1,15,802	1,21,876	22	2,37,700	304
వెంకటగిరి	1,16,936	1,22,300	04	2,39,240	298
చంద్రగిరి	1,50,249	1,58,607	60	3,08,916	395
తిరుపతి	1,48,101	1,50,100	38	2,98,239	267
శ్రీకాళహస్తి	1,17,635	1,25,546	16	2,43,197	293
సత్యవేడు	1,02,568	1,08,797	13	2,11,378	279
మొత్తం	8,68,273	9,10,597	188	17,79,058	2,130

తిరుపతి అర్బన్ : ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పొలిటికల్ హీట్ మొదలైంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎన్నికల కోడ్)ని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లక్ష్మీ శ ఆధ్వర్యంలో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణల ఇచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18వ తేదీన నోటిఫికేషన్ వెలువడనుండగా అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ చేపట్టేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈక్రమంలో రాజకీయ పార్టీల నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రచార పర్వం ప్రారంభించారు. ఇప్పటికే అధికార వైఎస్సార్‌సీపీ ఐదేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది.

తొలిసారి ఓటేయనున్నా



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఓటేయబోతున్నా. పోలింగ్ రోజు కోసం ఉత్సుకతతో ఎదురుచూస్తున్నా. ఎలాంటి ఒత్తిడికి, ప్రలోభానికి లొంగకుండా మనస్సాక్షి ఆదేశం మేరకు ఓటు హక్కు వినియోగించుకుంటా.

– జీవనలత, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థిని

ఆనందంగా ఉంది



దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నా అనుకుంటేనే ఆనందంగా ఉంది. ఎవరి నుంచి డబ్బులు తీసుకోకుండా ఆత్మప్రబోధానుసారం నచ్చిన అభ్యర్థికి ఓటేయాలని నిర్ణయించుకున్నా. మా చుట్టుపక్కల నివసిస్తున్న ఓటర్లకు కూడా ఇదే సూచించా.

– రత్నకుమార్, డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పువు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తాం.

– లక్ష్మీశ, కలెక్టర్, తిరుపతి